www.spotvoicenews.com శనివారం 21, మార్చి 2026

# స్పాట్ వాయిస్

తెలుగు దినపత్రిక
వరంగల్ | సంపుటి : 11 సంచిక: 134 | పేజీలు: 6 | వెల: రూ..3



## అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం
- భద్రకాళి ఆలయ అభివృద్ధికి సహకరించాలి..
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- మాఢ వీధుల అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్
- డీసీసీ ప్రెసిడెంట్, కుడా చైర్మన్ ఇనగాల
- 17 మంది బాధితులకు డబుల్ ఇండ్ల పంపిణీ

4

# గ్యాస్ మోసం..

## టైం చూసి నొక్కేస్తున్నారు..

- డెలవరీ చేయకున్న చేసినట్లు మెసేజ్
- ఏజెన్సీల మాయాజాలం
- హోటల్స్ కు అమ్ము కుంటున్న ఏజెన్సీలు
- బ్లాక్ దందాకు తెరసిన నిర్వాహకులు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- అధికారులు ఫోకస్ పెట్టినా ఫలితం శూన్యం

5

గ్యాస్ డెలివరీ ఇచ్చినట్లు మెసేజ్‌లు వస్తున్నాయి. కానీ గ్యాస్ సిలిండర్ మాత్రం ఇంటికి రావడం లేదు. ఏజెన్సీకి వెళ్లి అడిగితే అందరికీ అవే మెసేజ్‌లు వస్తున్నాయి. మళ్లీ బుక్ చేసుకోండి అని చెబుతున్నారు. యుద్ధం సాకుతో.. నిర్వాహకులు గ్యాస్ సిలిండర్ల కొరత సృష్టిస్తున్నారు. గృహ వినియోగానికి వాడే సిలిండర్లను వాణిజ్య, వ్యాపార సముదాయాలకు మళ్లిస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడుతున్న ఏజెన్సీలు వినియోగదారులను ఇబ్బంది పెడుతూ కాసులు పొగేసుకుంటున్నాయి. గ్యాస్ సిలిండర్లు ఖాళీ అయిన వినియోగదారులు ఏజెన్సీల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల అయితే తెల్లవారుజాము నుంచే ఏజెన్సీల ముందు ఖాళీ సిలిండర్లతో క్యూ కడుతున్నారు. అధికారులు గ్యాస్ కొరత లేదని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- స్పాట్ వాయిస్, బ్యూరో



## 'వాహన్' వచ్చేస్తోంది..

- జాతీయ డేటాబేస్‌లోకి తెలంగాణ వాహనాల వివరాలు
- రెండో వాహనం కొంటే 2శాతం ట్యాక్స్ కట్టక్కర్లేదు
- వాహనదారులకు బిగ్ రిలీఫ్
- ఈనెల 23 నుంచే అమల్లోకి..

3

## మతం ఏదైనా మనుషులంతా ఒక్కటే..



- అంతా ఐక్యంగా ముందుకుసాగాలి
- అన్ని మతాల వారు సోదరుడిగా భావించడం నా అదృష్టం
- మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్
- చిట్కుల్‌లో వెల్లివిరిసిన మత సామరస్యం...
- రామాలయ ప్రాంగణంలో ముస్లింలకు నీలం మధు రంజాన్ శుభాకాంక్షలు...
- అరుదైన ఘటనకు వేదికైన చిట్కుల్

2

## ఓరుగల్లుకు అన్యాయం

- బడ్జెట్‌లో 40 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు..
- చారిత్రక నగరిని నాశనం చేసే కుట్ర
- ఎంజీఎం, కేయూను విస్మరించారు..
- 10 ఎమ్మెల్యేలు ఇదేనా మీరు తెచ్చింది..?
- బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి



5



## ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

**మంత్రి కొండా సురేఖ**

స్పాట్ వాయిస్, వరంగల్: రంజాన్ వేడుకలను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లింలు అంత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన పలు ప్రార్ధనల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. మట్టేవాడ, ఎల్బీ నగర్, ఖిలా వరంగల్ ప్రాంతాల ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తుందని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. నిన్న ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల అభివృద్ధికి రూ.3,500 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని, ఇది కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని గుర్తు చేశారు. దీంతో ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఏర్పడిందని వివరించారు.



స్పాట్ వాయిస్
శనివారం 21, మార్చి 2026
హైదరాబాద్
www.spotvoicenews.com






# మతం ఏదైనా మనుషులంతా ఒక్కటే..

## అంతా ఐక్యంగా ముందుకుసాగాలి







**స్పాట్ వాయిస్, పఠాన్‌చెరు:** కులం, మతం ఏదైనా మానవత్వం ఒక్కటేనని, భారతీయులందరూ సోదరభావంతో మెలగాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం రంజాన్ పండుగ పురస్కరించుకుని చిట్కుల్ మైనార్టీలు నీలం మధు ముదిరాజ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరుదైన ఘటనకు చిట్కుల్ గ్రామం వేదికగా నిలిచింది. నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో చిట్కుల్‌లో జరుగుతున్న నూతన శ్రీ రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతున్న వేదిక వద్ద పూజా పనుల్లో నిమగ్నమై ఉన్న నీలం మధును పవిత్ర రంజాన్ పర్వదినాని పురస్కరించుకుని స్థానిక ముస్లింలు మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూ ధర్మ సంప్రదాయాల ప్రకారం దేవాలయ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతుండగా.. ఆలయంలో సంప్రదాయ దుస్తుల్లో ఉన్న నీలం మధు వద్దకు ముస్లింలు రావడం మత సామరస్యానికి అద్దం పట్టింది. వారిని సాదరంగా ఆహ్వానించిన నీలం మధు, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రేమను పెంచేలా ఉండాలి..**

పండుగలు ఏవైనా అవి మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి, ప్రేమాభిమానాలను పెంచేవిగా ఉండాలని నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఒకవైపు రామాలయ పునఃప్రతిష్ఠ జరుగుతుండగా, అదే సమయంలో ముస్లింలు వచ్చి రంజాన్ శుభాకాంక్షలు పంచుకోవడం గంగా-జమునా తెహజీబ్‌కు నిదర్శనమని ఆయన కొనియాడారు. భక్తి మార్గాలు వేరైనా లక్ష్యం ఒక్కటేనని, అందరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేవాలయ ప్రాంగణంలో చోటుచేసుకున్న ఈ ఆత్మీయ కలయిక స్థానికుల్లో అమితమైన

- అన్ని మతాల వారు సోదరుడిగా భావించడం నా అదృష్టం
- మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్
- చిట్కుల్‌లో వెల్లివిరిసిన మత సామరస్యం...
- రామాలయ ప్రాంగణంలో ముస్లింలకు నీలం మధు రంజాన్ శుభాకాంక్షలు...
- అరుదైన ఘటనకు వేదికైన చిట్కుల్



ఆనందాన్ని నింపింది. రాజకీయాలకు అతీతంగా, అందరినీ కలుపుకుని పోయే నీలం మధు తీరును గ్రామస్తులు, ముస్లిం పెద్దలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మైనారిటీ సోదరులు, ఆలయ నిర్వాహకులు, కాలనీ వాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**మనస్సున్న నేత..**

నీలం మధు ముదిరాజ్ మనస్సున్న నేత. ఆయనకు అందరినీ కలుపుకుపోయే గుణం ఉందనేది నేటి ఈ ఘటనను చూస్తే అందరికీ అర్థమవుతుంది. ఆయన మాట, నడవకడిక నేటి యువతకు ఆదర్శం. ఆయనను కులాలు, మతాలకు అతీతంగా అభిమానిస్తుంటారు. అందుకే ప్రతీ రోజు నీలం మధు ఇంటి వద్ద జనంతో కోలాహలం కనిపిస్తుంది. ప్రతీ ఒక్కరి సమస్యను ఆయన సమస్యగా ఫీలై.. పరిష్కారానికి ముందుంటాడు. సాయం చేసేందుకు ఎంత దూరమైన వెళ్తాడు. రంజాన్ పండుగ సందర్భంగా ఆయనను కలిసేందుకు ముస్లింలు ఏకంగా ఆలయం వరకు రావడం అంటే నీలం మధు ముదిరాజ్ పై వారికి ఉన్న ప్రేమ ఎంత స్వచ్ఛమైందో అర్థం చేసుకోవచ్చు.



## కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కొత్తకొండ గ్రామస్తులు

**స్పాట్ వాయిస్, భీమదేవరపల్లి:** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ను కొత్తకొండ గ్రామ అభివృద్ధి పనులకు సహకారం అందించినందుకు కొత్తకొండ గ్రామ సర్పంచ్, గ్రామ పాలకవర్గం శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొత్తకొండ గ్రామానికి ఈ మధ్యకాలంలో 5 హై మాస్ట్ లైట్లు. 2 బోర్లు, రూ.15 లక్షల సీసీ రోడ్లు మంజూరు చేయించారు. అదనంగా మే నెల బడ్జెట్‌లో మరో 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రసూల్ పల్లి, రంగయ్యపల్లి గ్రామాలకు సైతం రూ.15 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ గ్రామ సర్పంచ్ రమ రమేష్, రంగయ్యపల్లి సర్పంచ్ మండల రజిని మహేష్, రసూల్ పల్లి గ్రామ సర్పంచ్ బోయిని మహేష్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



**రంజాన్ పర్వదిన సందర్భంగా తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శనివారం ఉర్సు దర్గా పిఠాధిపతి హాజ్రాత్ సాయిద్ షా అలీ ఖాద్రి ఉబైద్ బాబా సాహెబ్ ను మర్యాదపూర్వకంగా కలిసి 'ఈద్ ముబారక్' తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. -స్పాట్ వాయిస్, వరంగల్**



## డిప్యూటీ సీఎం భట్టి కుమారుడి వివాహ వేడుకల్లో పాలకుర్తి ఎమ్మెల్యే

**స్పాట్ వాయిస్, బ్యూరో:** ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడి వివాహ అనంతర విందు వేడుకలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.



# 'వాహన్' వచ్చేస్తోంది..

- జాతీయ డేటాబేస్‌లోకి తెలంగాణ వాహనాల వివరాలు
- రెండో వాహనం కొంటే 2శాతం ట్యాక్స్ కట్టక్కర్లేదు
- వాహనదారులకు బిగ్ రిలీఫ్
- ఈనెల 23 నుంచే అమల్లోకి..



**స్పాట్ వాయిస్, ఓరుగల్లు:** రాష్ట్రంలో రెండో వాహనం కొనుగోలుపై అదనంగా విధిస్తున్న 2 శాతం లైఫ్ ట్యాక్స్‌ను రద్దు చేస్తూ రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 23 నుంచి ఆ విధానం అమల్లోకి రానుంది. అదే రోజున రాష్ట్ర వాహనాల డేటాను కేంద్ర ప్రభుత్వ 'వాహన్' పోర్టల్‌తో మంత్రి పొన్నం ప్రభాకర్ అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పెరగడమే కాకుండా జాతీయ డేటాబేస్‌లో తెలంగాణ వాహనాల వివరాలు అందుబాటులోకి రాను న్నాయి. వాహన్ పోర్టల్ ద్వారా దేశవ్యాప్త వాహనాల సమాచారం ఒకే చోట లభ్యమవుతుందని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు. కేంద్రప్రభుత్వ వాహన్ పోర్టల్‌తో అనుసంధానం కావడంతో తెలంగాణకు చెందిన వాహ నాల వివరాలు జాతీయ డేటాబేస్‌లోకి వెళ్తాయని అన్నారు.

### సారథితో పాటు వాహన్

ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం సొంత ఐటీ వ్యవస్థపైనే ఆధారపడటంతో జాతీయ నెట్‌వర్క్‌కు దూరంగా ఉంది. తాజాగా.. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ 'వాహన్' పోర్టల్‌లో చేరేందుకు రెడీ అయింది. ఇప్పటికే లైసెన్సుల జారీ కోసం సారథి పోర్టల్ అమలు చేయగా.. ఇప్పుడు వాహన రిజిస్ట్రేషన్ల కోసం కొత్తగా వాహన్‌ను అనుసంధానించనుంది. దీంతో అంతరాష్ట్ర వాహనాల కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ ఈజీ కానుంది. తెలంగాణలో రిజిస్టర్ అయిన వాహనాన్ని ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లినా.. అక్కడి వారు ఇక్కడ వాహనాలను కొనుగోలు చేసినా అవసరమైన పత్రాల కోసం గతంలో ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇక నుంచి వాహన్ పోర్టల్ ద్వారా కేంద్ర సర్వర్‌లో డేటా అందుబాటులో ఉంటుంది. దీన్ని వల్ల ఎన్ఓవో వంటి సాంకేతిక ప్రక్రియలు సెకన్ల వ్యవధిలోనే ఆన్‌లైన్ వేదికగా పూర్తి కానున్నాయి.

### సులువుగా అడ్రస్ మార్పు

'వాహన్' అందుబాటులోకి వస్తే వెహికల్ యజమాని అడ్రస్ మార్పు, డూప్లికేట్ ఆర్సీ, రిమూవల్ వంటి పనులు ఆర్టీఏ ఆఫీసులకు వెళ్లకుండా నేరుగా ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ వెహికల్స్ కొనుగోలు చేయాలనుకుంటే ఆ వాహనం గత చరిత్ర, పెండింగ్ చలాన్లు, ఇంజిన్ ఛాసిస్ నంబర్లను సులభంగా సరిచూసుకోవచ్చు. రోడ్ ట్యాక్స్ చెల్లింపులు, ఈ-చలానాల ప్రక్రియ కూడా వేగవంతం అవుతుంది. వాహన్ పోర్టల్‌లో చేరటం వల్ల నేర నియంత్రణలోనూ పోలీసులకు వెసులుబాటు కలుగుతుంది. చోరీకి గురైన వాహనాలు ఇతర రాష్ట్రాల్లో అమ్మకానికి వచ్చినా.. వాటి గుర్తింపు వెంటనే తెలుస్తుంది.

# చంపుతారనే భయంతోనే చంపేశాడు..

**భార్య, మామ హత్య కేసులో నిందితుడి అరెస్ట్**

**వెల్లడించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి**

**స్పాట్ వాయిస్, కాజీపేట:** కాజీపేట మండలం కడిపికొండ గ్రామ శివారులోని రాజీవ్ గృహకల్పలో ఇటీవల భార్యను, మామను హత్య చేసిన నిందితున్ని శనివారం మడికొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ వివరాలను కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు. గీసుగొండ మండలం శాయంపేట గ్రామానికి చెందిన పొక్కుల ప్రవీణ్ కు మృతుడు భాష బోయిన రాజశేఖర్ కుమార్తె రాజశ్రీతో 18 నవంబర్ 2023 న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. నిందితుడు ప్రవీణ్ కు వరకట్నం కింద రూ.3 లక్షల నగదు అందజేశారు. ప్రవీణ్ ప్రస్తుతం హైదరాబాదులోని మల్కాజిగిరిలో కోకా కోలా కంపెనీలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. పాప పుట్టినప్పటి నుంచి ప్రవీణ్ పని మానేసి ఏదైనా బిజినెస్ చేసుకుంటానని అదనపు కట్నం కోసం భార్య రాజశ్రీని వేధిస్తుండేవాడు. రాజశ్రీ పలుమార్లు విషయాన్ని తండ్రి రాజశేఖర్ కు చెప్పగా, రాజశేఖర్ నిందితుడు ప్రవీణ్ ను తమ కూతురిని కట్నం కోసం వేధిస్తే చంపుతానని బెదిరించాడు. నిందితుడు ప్రవీణ్, భార్య రాజశ్రీ లకు ఈనెల 17వ తేదీన కట్నం కోసం గొడవ జరగగా ఇంట్లో తాగి ఉన్న మామ ప్రవీణ్ ను ఎక్కడ చంపుతాడని భయం వేసి భార్య రాజశ్రీ, మామ రాజశేఖర్ ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికే ఇంట్లో తెచ్చి పెట్టుకున్న డీజిల్ బాటిల్, సుత్తెన సిద్ధం చేసుకున్నాడు. 18వ తేదీ తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో సుత్తితో మొదట మామను, తర్వాత భార్య రాజశ్రీని గట్టిగా తలలపై కొట్టాడు. వారు బతికితే ఎక్కడ అతనిని చంపుతారని ఇరువురిపై డిజిల్ పోసి అగ్గిపుల్లతో నిప్పంటించాడు. అనంతరం నిందితుడు ప్రవీణ్ వారి ఇద్దరి పిల్లలను తీసుకొని బయటకు వచ్చి ఎదుటి వాళ్లను నమ్మించడానికి ప్రయత్నించాడు.



భార్య రాజశ్రీ, మామ రాజశేఖర్ గొడవ పడి తగలబెట్టుకున్నారని నమ్మించే ప్రయత్నం చేశాడు. 108 కు కాల్ చేసి సమాచారం అందించారు. బంధువులకు సైతం ఇదేవిధంగా చెప్పి నమ్మించే ప్రయత్నం చేశాడు, విషయాన్ని తెలుసుకున్న రాజేశ్వరి చెల్లెలు తేజశ్రీ అక్కడికి చేరుకోగానే నిందితుడు ప్రవీణ్ ను ఎలా జరిగిందని అడగగా పొంతనలేని సమాధానాలు చెబుతూ అక్కడి నుంచి పారిపోయాడు. భార్య రాజశ్రీ, మామ రాజశేఖర్ ను హత్య చేసిన నిందితుడు ప్రవీణ్ ఆరోజు నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నాడు. అయితే శనివారం పిల్లల కోసం కడిపికొండలోని బంధువులను అడిగి తెలుసుకుందామని బ్రిడ్జి వద్దకు రాగా మడికొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. హత్య చేయడానికి ఉపయోగించిన సుత్తి, డీజిల్ బాటిల్, మొబైల్ ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సమావేశంలో సీఐ పుల్యాల కిషన్, ఎస్సైలు రాజబాబు, రామ్మోహన్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

**స్పాట్ వాయిస్, రేగొండ:** రేగొండ, కొత్తపల్లి గోరి మండలాలకు చెందిన 88 మంది లబ్ధిదారులకు శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నిరుదలకు సీఎం సహాయ నిధి ఒక వరంలాంటిదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ నిధి ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు, ఇతర అత్యవసర అవసరాల సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కృష్ణయ్య, కాంగ్రెస్ రేగొండ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, రేగొండ మండల సర్పంచ్ వారణాసి మౌనిక-అంజి, చెన్నాపూర్ సర్పంచ్ బిక్షపతి రామన్నగూడెం, సర్పంచ్ వీరు నాయక్ పాల్గొన్నారు.





## బొల్లి నాగరాజు ముదిరాజ్ కుటుంబానికి మెపా పరామర్శ

**స్పాట్ వాయిస్, హన్మకొండ:** హనుమకొండలోని వడ్డేపల్లికి చెందిన బొల్లి నాగరాజు ముదిరాజ్ మరణం బాధకరమని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ ముదిరాజ్ సమాచారం మేరకు పులి దేవేందర్ ముదిరాజ్, గౌరవ సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్ నాగరాజు ముదిరాజ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



## రంజాన్ వేళ తేనేటి విందు...

**స్పాట్ వాయిస్, మంథని:** రంజాన్ పండుగను పురస్కరించుకుని మంథని పట్టణంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్కే యాకూబ్, సుల్తాన్ ఆసిఫ్ ఖాన్, ఇర్ఫాన్‌ల స్వగృహాల్లో ఏర్పాటు చేసిన తేనేటి విందును మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో పండుగలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం స్థానిక నాయకులతో ముచ్చటిస్తూ వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**స్పాట్ వాయిస్, నల్లబెల్లి:** తమతో పాటు చదువుకున్న స్నేహితురాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి మిత్రులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. 2002-03లో నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారితో పాటు విద్యను అభ్యసించిన శంషాబాద్ గ్రామానికి చెందిన కొలిపాక విజయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పూర్వ స్నేహితులు శనివారం గ్రామానికి వెళ్లి బాధితకుటుంబాన్ని పరామర్శించారు. రూ.30 వేల ఆర్థికసాయాన్ని అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్యాల.రాజేందర్, రామిని.నాగరాజు, పెరుమాండ్ల.శ్రీనివాస్, ఎస్.అశోక్, పులిగుజ్జుల. రాజు, మామిడి.రాజు, పప్పు.రేణు, తండా.సంపత్, బి. సుమలత, పి.సుమలత, పలువురు స్నేహితులు ఉన్నారు.



## ఆయిల్ పామ్ సాగుపై రైతుల క్షేత్ర ప్రదర్శన

**స్పాట్ వాయిస్, నల్లబెల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సాధించింది. దీంతో రైతులకు అవగాహన కల్పించేందుకు ఆయిల్ పామ్ సాగుపై క్షేత్ర ప్రదర్శన నేపథ్యంలో సిద్ధిపేట జిల్లా నర్మేట గ్రామంలోని ఆయిల్ పామ్ సాగుతో పాటు పామాయిల్ గింజల నుంచి ఇంధనాన్ని తీసే కర్మాగారాన్ని సైతం సందర్శించే కార్యక్రమాన్ని చేపట్టారు. పామాయిల్ పంట సాగుపై రైతులకు ఆర్థిక స్వాలంబన తోపాటు సాగు శ్రమ తగ్గింపుపై అవగాహన కల్పించారు. నల్లబెల్లి మండలం నుంచి నల్లబెల్లి మండల కేంద్రం కొండాయిలపల్లి,శనిగరం, ముచింపుల, రేలకుంట, నందిగామ, మేడపల్లి,రామతీర్థం గ్రామాల రైతులు సుమారు 250 మంది ఈ క్షేత్ర ప్రదర్శనకు శనివారం బయలుదేరారు. వీరి వెంట వ్యవసాయ విస్తరణ అధికారి మహేందర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్చార్జి సీఈవో ఎల్లన్న ఉన్నారు.

# అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం
- భద్రకాళి ఆలయ అభివృద్ధికి సహకరించాలి..
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- మాడ వీధుల అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్
- డీసీసీ ప్రెసిడెంట్, కుడా చైర్మన్ ఇనగాల
- 17 మంది బాధితులకు డబుల్ ఇండ్ల పంపిణీ



**స్పాట్ వాయిస్, హన్మకొండ:** అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, అభివృద్ధి వల్ల నష్టపోయే ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హన్మకొండలోని కుడా కార్యాలయంలో భద్రకాళీ ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మాడ వీధుల నిర్మాణంతో ఇళ్లను కోల్పోతున్న భూ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కుడా చైర్మన్ ఇనగల వెంకట్రాం రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలను అందజేశారు. అనంతరం నాయిని మాట్లాడుతూ.. భద్రకాళీ ఆలయ అభివృద్ధి అనేది చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన అంశమని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెంటనే నిధులు కేటాయించి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించామని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మాఢ వీధుల నిర్మాణం చేపట్టడంతో కొన్ని కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోతున్న నేపథ్యంలో వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా సుమారు 17 కుటుంబాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ స్థలాలను అప్పగించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలు ముందుకు వస్తే ప్రభుత్వం కూడా వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు.17 మంది కుటుంబాలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఇళ్లను కోల్పోతున్న ప్రతీ కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించడం మాత్రమే కాకుండా ఔట్ సోర్సింగ్ ద్వారా ఉపాధి అవకాశాలను కూడా కల్పించించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎటువంటి రాజకీయ దురుద్దేశ్యాలు లేకుండా ప్రజలకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా కొనసాగిస్తూ, ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.

### గొప్ప ముందడుగు

-కుడా చైర్మన్ ఇనగాల

భద్రకాళి దేవాలయ అభివృద్ధి నగరాభివృద్ధిలో అత్యంత కీలకమని, మాఢవీధుల నిర్మాణం కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కుటుంబాలకు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాధితులకు తక్షణమే గృహ వసతి కల్పించాలనే పట్టుదలతో ఈ ప్రక్రియను వేగవంతం చేశామని ఆయన పేర్కొన్నారు. మాఢవీధుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్వాసిత కుటుంబాలకు ఎలాంటి అన్యాయం జరగకుండా, వారికి మెరుగైన వసతులు కల్పిస్తామని, ఆధ్యాత్మిక నగరిగా వరంగల్‌ను తీర్చిదిద్దడంలో ఇదొక గొప్ప ముందడుగని అన్నారు.

# మొక్కలను నాటి పరిరక్షించాలి..

- ఎండకాలంలో పక్షులకు నీటిని అందించాలి
- హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం




**స్పాట్ వాయిస్, హన్మకొండ:** హన్మకొండ అటవీ శాఖ, ఒరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీ శాఖాధికారి బి. లావణ్య సుబేదారిలోని ఫారెస్ట్ కాంప్లెక్స్ నుంచి హంటర్ రోడ్డులోని జూ పార్క్ వరకు నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ హాజరై పర్యావరణ పరిరక్షణపై ప్రాధాన్యతను వివరించారు. అడవులను సంరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని, దాని కోసం అడవులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మట్టి పాత్రల్లో నీరు, ఆహారం ఉంచడం ద్వారా పక్షులు, జీవజాలానికి సహాయపడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ బి. మయూరి, ఒరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు ఇందారం నాగేశ్వర్ రావు, చెలుపూరి శ్యామ్ సుందర్, పిట్టల రవి బాబు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిప్పని రాధిక, జిల్లా అటవీ శాఖ సిబ్బంది, జూ పార్క్ సెక్షన్ ఆఫీసర్లు సురిదాస్, శివ కుమార్, బీట్ ఆఫీసర్లు శారద, శ్వేత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

**బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్**



**స్పాట్ వాయిస్, హన్మకొండ:** అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలను తీవ్ర నిరాశకు గురి చేసిందని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జనాభాలో సగభాగానికి పైగా 56 శాతం ఉన్న బీసీలకు ప్రభుత్వం కేవలం 3.85 శాతం మాత్రమే కేటాయించి తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులు ఎవరి మెప్పు కోసమని ఆయన ప్రశ్నించారు. శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రూ. 3,24,234 కోట్ల బడ్జెట్ లో 56 శాతం ఉన్న బీసీలకు కేవలం రూ. 12,511 కోట్లను, బడ్జెట్ లో కేవలం 3.85 శాతం మాత్రమే కేటాయించడం దేనికి సంకేతమని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ హామీనా...? లేక ఎన్నికల మోసమా అని అన్నారు. ప్రతి ఏడాది బీసీల కోసం రూ. 20వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తామని చెప్పారని, కానీ రెండేళ్లలో రూ.5 వేల కోట్లను కూడా ఖర్చు చేయకపోవడం అమలులో లోపమా..? బీసీలంటే లెక్కలేని తనమా అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పెద్దలు బీసీ సమాజానికి తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కులవృత్తులు, సంచార జాతర వారు కాంగ్రెస్ పెద్దలకు కనిపించరా..? అని ప్రశ్నించారు. కౌలు రైతులు, చిన్న రైతులు ఎక్కువగా బీసీలే..కాబట్టి పాలసీలో అందరూ రైతులు ఒకటేనని చెప్పి, భూమి ఎక్కువగా ఉన్న అగ్రకులాల వారికి ఎక్కువగా సబ్సిడీలు ఇస్తూ.. సంపదను దోచుపెడుతున్నారన్నారు. కానీ ఎలాంటి భూమి లేని 50 లక్షల నిరుపేద బీసీ కుటుంబాలకు ఈ బడ్జెట్ వలన ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. రాష్ట్రంలో చెమటోడ్చి సగభాగానికి పైగా సంపదను సృష్టించే బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిన్నచూపు చూస్తోందన్నారు. గత ఏడాది రూ.11,405 కోట్లను కేటాయించి, ఖర్చు కూడా చేయలేదన్నారు. 2024-25 సంవత్సరంలో రూ. 9,200 కోట్లు కేటాయించి..కేవలం రూ.2,080 కోట్లను మాత్రమే ఖర్చు చేసిందని, 2025-26 సంవత్సరంలో రూ.11,400 కోట్లు మాత్రమే కేటాయించి, కేవలం 3వేల కోట్ల రూపాయలను మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఈ ఏడాది కూడా బీసీలకు ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అదే కథ పునరావృతం అవుతుందోనని వడ్ల కొండ వేణుగోపాల్ గౌడ్ ఫైర్ అయ్యారు.



## కేయూ మాజీ వీసీ లింగమూర్తికి నివాళి

**స్పాట్ వాయిస్, హన్మకొండ:** కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ఎన్.లింగమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, కేయూ విశ్రాంత ప్రొఫెసర్ గద్ద భాస్కర్ శనివారం లింగమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లింగమూర్తి మరణం విద్యారంగం, విద్యార్థి ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన వీసీగా ఉన్నప్పుడు కేయూలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు.

శనివారం 21, మార్చి 2026

# గ్యాస్ మోసం...

## టైం చూసి నొక్కేస్తున్నారు..

- డెలవరీ చేయకున్న చేసినట్లు మెసేజ్
- ఏజెన్సీల మాయాజాలం
- హోటల్స్‌కు అమ్ముకుంటున్న ఏజెన్సీలు
- బ్లాక్ దందాకు తెరసిన నిర్వాహకులు
- ఇబ్బందులు పడుతున్న వినియోగ దారులు
- అధికారులు ఫోకస్ పెట్టినా ఫలితం శూన్యం

**స్పాట్ వాయిస్, బ్యూరో:** గ్యాస్ కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్యాస్ కోసం ప్రజలు ఏజెన్సీల ముందు బారులు తీరి కనిపిస్తున్నారు. ఇప్పటికే వాణిజ్య గ్యాస్ సిలిండర్‌కు తీవ్ర కొరత ఏర్పడటంతో.. వారంతా ఏజెన్సీలతో కుమ్మక్కై డొమస్టిక్ గ్యాసులను బ్లాక్ లో కొనేస్తున్నారు. దీంతో గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ రేట్లకు గ్యాస్ అమ్ముతూ దళారులు దండుకుంటున్నారు. బ్లాక్‌మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వం అత్యవసర వినియోగదారుల చట్టాన్ని అమలు చేస్తున్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీలు వాటిని పట్టించుకోవడం లేదు. అక్రమంగా గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేసే వారు కూడా ఈ కొరత పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. బుక్ చేసుకున్న వారం పది రోజులకు కూడా గ్యాస్ సిలిండర్ డెలివరీ కాకపోవడంతో వినియోగదారులు ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఉదయం నుంచి గ్యాస్ కోసం పడిగాపులు కాస్తున్నా, సరిపడే గ్యాసు లేక చాలా మంది ఉట్టి చేతులతో వెనుదిరుగుతున్నారు.



### టైం చూసి నొక్కేస్తున్నారు..

గ్యాస్ ఏజెన్సీలు టైం చూసి నొక్కేస్తున్నారు. యుద్ధ ప్రభావంతో గ్యాస్ కొరత వస్తోందనే వార్తలు వైరల్ కావడంతో.. ఏజెన్సీలు అలర్ట్ అయ్యాయి. గ్యాస్ బుక్ చేసుకున్న వారికి సిలిండర్లు సరఫరా చేయకుండా.. వ్యాపారులకు ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. ఏదో మిస్టేక్ అయి ఉంటుందని దాటవేస్తున్నారు. ఇంకా.. బుక్ చేసుకొని పది రోజులు దాటిన సిలిండర్ ఇంటికి రావడం లేదు.. ఇదేంటంటే గ్యాస్ కొరత అంటూ దాటవేస్తున్నారు.

### తెలివి మీరిన ఏజెన్సీలు..

గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు తెలివి మిరిపోయారు. గ్యాస్ బుక్ చేసుకొని కస్టమర్లకు బుక్ చేసుకున్నట్లు ఓటీపీలు వస్తున్నారు. హన్మకొండ నగరంలోని ఓ ఏజెన్సీ వద్ద ఇటీవల ఓ కస్టమర్ ఈ విషయమై ఆందోళనకు దిగాడు. తాను గ్యాస్ బుక్ చేయలేదని, అయినా ఓటీపీ ఎలా వచ్చిందంటే ఏజెన్సీ నిర్వాహకులు నీళ్లనమిలారు. గ్యాస్ బుక్ చేసుకొని వారి పేరిట సైతం ఏజెన్సీ నిర్వాహకులు బుక్ చేసి సిలిండర్లను అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. గ్యాస్ కొరతపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని, కఠిన చర్యలు తీసుకుంటే తప్పా.. సరైన సమయానికి గ్యాస్ సరఫరా చేయరని ప్రజలు అంటున్నారు.

# బడ్జెట్‌లో ఓరుగల్లుకు అన్యాయం

- రూ.40 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు..
- చారిత్రక నగరిని నాశనం చేసే కుట్ర
- ఎంజీఎం, కేయూను విస్మరించారు..
- 10 ఎమ్మెల్యేలు ఇదేనా మీరు తెచ్చింది..?
- బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి




**స్పాట్ వాయిస్, హన్మకొండ:** బడ్జెట్లో వరంగల్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఏనుగుల రాకేష్ రెడ్డి మండిపడ్డారు. శనివారం హన్మకొండ ఎన్జీవోస్ కాలనీలోని తన కార్యాలయంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఓరుగల్లును తగ్గించే కుట్ర చేస్తోందన్నారు. అందులో భాగంగానే మొదట్లోనే తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి కాకతీయ కళా తోరణం తీసేయాలని కుట్ర పన్నారని ఆరోపించారు. మన ఓరుగల్లును మీది మాటలకు రెండో రాజధాని, రెండవ రాజధాని అంటూనే చివరకు మనల్ని రెండవ శ్రేణి పౌరులుగా చూసిందంటూ దుయ్యబట్టారు. బడ్జెట్ లో ఒక్క కొత్త ప్రాజెక్ట్ ప్రస్తావన లేదని, పాత వాటికి సరిపడా కేటాయింపులు లేవని ఆరోపించారు. ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కైనా ఎంజీఎం సమస్యలతో సతమవుతుంటే, వైద్య సౌకర్యాలను మెరుగుపరిచే వైద్య పరికరాలకు ఎక్కడ సరిపడా నిధులు కేటాయించలేదని ఆరోపించారు. వరంగల్లో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే ఓరుగల్లుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత వివక్షంగా ఉందో అర్థమవుతోందన్నారు. ఓయూ కి 1,000 కోట్లు, కోటి మహిళా కాలేజీకి 400 కోట్లు ఇచ్చారని, మరి ఉద్యమాల కేంద్రం కేయూకు కనీసం రూ.500 కోట్లైనా ఇవ్వారా అంటూ ప్రశ్నించారు. దేవాదులకు 18, 500 కోట్లు అవసరమైతే 1,566 కోట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. దేవాదులపై బారిబారీ స్పీచ్ లు ఇచ్చే నాయకులు ఈ వివక్ష పై స్పందించాలని డిమాండ్ చేశారు.

### నాశనం చేసే కుట్ర

ఓరుగల్లు స్మార్ట్ సిటీ పథకానికి ఒక్క రూపాయి కేటాయించకపోవడం దారుణమని రాకేశ్ రెడ్డి అన్నారు. చారిత్రక నగరాన్ని ఇప్పటికే మురికి కూపంగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరింత నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నట్టుందని ఆరోపించారు. వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కోసం కేటాయింపులు లేవని, సిటీలో మౌలిక సదుపాయాల పెంపు కోసం కేటాయింపులు లేవన్నారు. అన్నింటికీ కలిపి నగరానికి ఒక 40 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఇది పచ్చి మోసం. దుర్మార్గమంటూ ఆయన ఫైర్ అయ్యారు. పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే ఇదేనా ఈ ప్రభుత్వం ఓరుగల్లుకు ఇచ్చిన బహుమానం? ఇదేనా మీరు తీసుకొచ్చిన మార్పు? అంటూ నిలదీశారు.

# కరీంనగర్ టూ టౌన్ ఎస్సై ఆత్మహత్య

**భార్య మరణించిన ఐదు రోజుల్లోనే ఘటన**

**అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు**



**స్పాట్ వాయిస్, కరీంనగర్:** పోలీస్ శాఖలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన భార్య ఈనెల 16న సూసైడ్ చేసుకోగా.. ఐదు రోజుల వ్యవధిలోనే ఎస్సై చంద్రశేఖర్ సైతం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా.. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. కారణం ఏంటో తెలియదు కానీ.. దివ్య గన్నేరు పప్పు తిని ఆత్మహత్యకు ప్రయత్నించగా గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయారు. అయితే దివ్య అంత్యక్రియల సమయం లో కొందరు గ్రామస్తులు, బంధువులు చంద్రశేఖర్‌పై దాడికి ప్రయత్నించారు. దివ్య మరణానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఆ సమయంలో దివ్య తల్లిదండ్రులే అల్లుడిని కాపాడినప్పటికీ, ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన భార్య లేదన్న బాధ, సమాజం వేలెత్తి చూపుతుందన్న అవమానం ఆయనను వెంటాడాయి. భార్య చనిపోయిన ఐదో రోజు కార్యక్రమం కోసం చంద్రశేఖర్ ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని తన అత్తగారింటికి వెళ్లారు. అందరూ ఇంట్లోనే ఉండగా.. ఒక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్న ఆయన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డారు. ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఆయన అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు..

**స్పాట్ వాయిస్, కమలాపూర్:** మండలంలోని భీంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. ఏప్రిల్ చివరి వారంలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తోందని చెప్పారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించామని, ఈ నిధుల ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరిన్ని ఇళ్లు ఇస్తుందని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని.. విడుతల వారీగా అందరికీ ఇండ్లు కేటాయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భీంపల్లి సర్పంచ్,వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా రంజాన్ పండుగా

**స్పాట్ వాయిస్, దామెర:** మండలంలోని ఊరుగొండ గ్రామంలో రంజాన్ పండగా సందర్భంగా ప్రస్తుత మెదక్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ అహ్మద్, మాజీ వైస్ ఎంపీపీ జాకిర్ అలీ గ్రామ ముస్లింతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని అల్లాని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజుద్దీన్ ,అజం ఖాన్ ,సాబీర్ అలి ,చోటే ,ఖాలీద్ ,కరీం ,అఖీల్ ,రషీద్, ముజీబ్ ,జహంగీర్ ,అంజద్ ,మాధార్ ,షరీఫ్ ,ఘని అజెం,వాజీద్, గౌస్ ,జహీర్ పాల్గొన్నారు.



## నిరుపేద ముస్లింలకు దుస్తుల పంపిణీ

**స్పాట్ వాయిస్, హసన్ పర్తి:** హసన్ పర్తి 66వ డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో రంజాన్ సందర్భంగా కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ నిరుపేద ముస్లిం కుటుంబాలను గుర్తించి శనివారం వారికి దుస్తులు, సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మారం తిరుపతి, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వరరావు, రైల్వే బోర్డు మెంబర్ తాళ్ళ శ్యామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

SPOT VOICE NEWS.COM SPOT VOICE NEWS.COM













# భక్తి భావం చాటిన నీలం మధు

**సొంత నిధులతో చిట్కుల్ లో రామ మందిర నిర్మాణం**

**శాస్త్రోక్తంగా మొదలైన స్వామి ప్రతిష్ఠాపన వేడుకలు**

**వేద మంత్రాలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**

**స్పాట్ వాయిస్, పటాన్ చెరు:** ధర్మ రక్షణే ధ్యేయంగా, భక్తి భావంతో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ శ్రీ రాముని ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. సొంత నిధులతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జీటీఎన్ కాలనీలో శ్రీ రామచంద్ర స్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. లోక కళ్యాణార్థం ఆయన చేపట్టిన ఈ శ్రీరామచంద్ర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా సాగింది. మొదటి రోజైన శనివారం నీలం మధు దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు గోపూజ, మందిర ముఖ మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, భక్తుల సమక్షంలో దీక్షాధారణ, రక్షాబంధన, యాగశాల సంస్కారం వంటి క్రతువులను వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అఖండ దీపస్థాపన, వాస్తు మండపారాధనలతో ఆలయ ప్రాంగణం ముచ్చట గొలిపింది. సాయంత్రం వేళ ప్రతిష్ఠ, మూర్తులకు పంచ వింశతి (25) కలశ స్నపనం (బింబ శుద్ధి) నిర్వహించారు. అనంతరం మూర్తులకు దీక్షాధారణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట యాగ మండప దేవతా హవనములు జరిపారు. వాస్తు, నవగ్రహ, క్షేత్రపాల దేవతలకు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో చిట్కుల్ గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# దీన్ దయాళ్ అడుగుజాడలు అనుసరణీయం

**భారతీయ ఆలోచనలకు ప్రముఖ స్తంభం**

**సైద్ధాంతిక నిబద్ధతతోనే సంస్థాగత నిర్మాణం**

**బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్**

**స్పాట్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా గిర్మాజీపేట మండలం ఆధ్వర్యంలో 28వ డివిజన్ కార్పొరేటర్ గందే కల్పన అధ్యక్షతన గుజరాత్ సమాజ్ భవన్ లో 'దీన్ దయాళ్ ప్రశిక్షణ అభియాన్'లో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సమావేశమై, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి ఆదర్శాలను, సిద్ధాంతాలను చర్చించారు. అనంతరం గంట రవికుమార్ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిరంతర అధ్యయనం సంస్థాగత క్రమశిక్షణ, సమర్థవంతమైన సమాచార మార్పిడి ఎంత కీలకమో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నిరంతర శ్రమ, సైద్ధాంతిక నిబద్ధతతోనే సంస్థాగత నిర్మాణం మరింత పటిష్టమవుతుందని చెప్పారు. బీజేపీ ప్రధాన సైద్ధాంతిక పునాది పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం. ఇది కమ్యూనిజం, పెట్టుబడిదారీ విధానాలకు భిన్నంగా, మానవుడిని కేంద్రంగా ఉంచుకుని, వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సును, ఆధ్యాత్మికతను సమన్వయం చేసే స్వదేశీ ఆర్థిక, రాజకీయ నమూనా వంటి అంశాలపై కార్యకర్తలకు గంట రవి కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు గడల కుమార్, ప్రశిక్షణ అభియాన్ అబ్జర్వర్ కనుకుంట్ల రంజిత్ కుమార్, జిల్లా నాయకులు కూచన క్రాంతి కుమార్, మాదాసు రాజు, మండల అధ్యక్షులు సీతా నాగరాజు, మండల నాయకులు రామిని సుమన్, జెట్లింగ్ శివ పాల్గొన్నారు.



# బస్టాండ్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

**మంత్రి ధనసరి అనసూయ సీతక్క**

**ములుగులో నిర్మిస్తున్న**

**మోడల్ బస్టాండ్ పనుల పరిశీలన**

**స్పాట్ వాయిస్, ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలో రూ. 4.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బస్టాండ్ నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి, జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఆధునిక సదుపాయాలతో కూడిన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం వేచిచోట్ల, తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు వంటి మౌలిక వసతులు సమకూర్చబడతాయని పేర్కొన్నారు. ములుగు జిల్లా అభివృద్ధిలో భాగంగా ఈ బస్టాండ్ కీలక పాత్ర పోషిస్తుందని, నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, ఇతర ప్రజాప్రతినిధులు మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



Printed, Published & Owned by PALLEBOINA NAGARAJU, Printed at NEW THINK PUBLICATIONS, H.No: 2-9-355/1, Sneha Nagar, NGO's Colony, Road No.19, Hanamkonda, Pin : 506001, Telangana State. email: spotvoicenews@gmail.com, Office No : 7097272172 * RNI NO.TELTEL/2014/62703